సాక్షి అనకాపల్లి

మంగళవారం । 28 । మార్చి । 2023



అర్జీల విచారణ

కలెక్టరేట్ స్పందనకు 175 అర్జీలు వచ్చాయి. వినతులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8లో



అక్షర విన్యాసం

ఆనందపురం: తర్లువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీ-20 అక్షరాల ఆకృతిలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



గంజాయి తరలింపు

బియ్యం బస్తాల మాటున రూ.17.80 లక్షల విలువైన గంజాయి తరలిస్తున్న లారీని కశింకోట పోలీసులు పట్టుకున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6-13	4-40
నర్సీపట్నం	6-17	4-40

న్యూస్‌రీల్

బాలికల హాస్టల్లో అదనపు సౌకర్యాలు



బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో సదుపాయాలు మెరుగుపర్చడానికి ముందుకు వచ్చిన లాయిరస్ పరిశ్రమ ఆధ్వర్యంలో తాజాగా పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించారు. వసతి గృహానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించి, మరమ్మతులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని పరిశ్రమ నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహం సంక్షేమ అధికారి పి.నిర్మల, పరిశ్రమ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ ఈవోగా బండారు



బాధ్యతలు చేపట్టిన ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి టౌన్: నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఈవోగా బండారు ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.చంద్రశేఖర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా దేవదాయ శాఖ జిల్లా అధికారిగా నియమించారు. బండారు ప్రసాద్ విశాఖ మురళీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

జిల్లా ఇన్‌చార్జి ఏసీ బదిలీ

అనకాపల్లి జిల్లా దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న బుద్ధ మహాలక్ష్మినగేష్‌ను విశాఖ సత్యనారాయణస్వామి దేవస్థానం ఈవోగా బదిలీ చేశారు. జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజారావుకు ఇన్‌చార్జి ఏసీగా బాధ్యతలు అప్పగించారు.

మేనమామపై పోక్సో కేసు

పెదగంట్యాడ: మేనకోడలిపై లైంగిక దాడికి పాల్పడిన వెంకటరమణపై న్యూపోర్టు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం రాత్రి బాలికను ఫైర్ స్టేషన్ వెనుక ఉన్న చాకలిగెడ్డ వద్దకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరువాత ఇంటికి తీసుకొచ్చి వదిలేశాడు. బాలిక చెప్పిన విషయాల ఆధారంగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అతిథి గృహంలోకి అటవీశాఖ కార్యాలయం



ఫారెస్ట్ గెస్ట్ హౌస్

నర్సీపట్నం: జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయాన్ని అటవీశాఖ అతిథిగృహంలోకి మార్చారు. జిల్లాల పునర్విభజన తర్వాత నర్సీపట్నం డిఎఫ్‌వో కార్యాలయాన్ని జిల్లా కార్యాలయంగా మార్పు చేశారు. శివపురంలో ఉన్న కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతపల్లి రోడ్డులో కలప డిపోలో ఉన్న అటవీశాఖ అతిథి గృహంలోకి సోమవారం మార్చారు. అతిథిగృహం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న రేంజర్ కార్యాలయాన్ని పక్కనే రేంజర్ క్వార్టర్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో రాజారావు మాట్లాడుతూ ప్రధాన కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాన్ని మార్చినట్టు చెప్పారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయం కూడా తమ అధీనంలో ఉంటుందన్నారు. ఇక నుంచి పరిపాలన అతిథిగృహం నుంచి కొనసాగుతుందన్నారు.





జీ20 ప్రతినిధులకు ఫ్లవర్‌ఫుల్ స్వాగతం

వెల్‌కమ్ టు వైజాగ్



సిటీ లుక్ : విద్యుత్ కాంతుల్లో సుందర నగరం

- జీ-20 సదస్సులో పాల్గొనే ప్రపంచ దేశాలకు ఆహ్వానం
- నేటి నుంచి వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ పేరుతో జీ 20 సదస్సు
- ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహణ
- రూ.157 కోట్లతో సర్వాంగ సుందరంగా విశాఖ ముస్తాబు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. రోడ్లు మెరిసిపోతున్నాయి.. రోడ్ల మధ్య ఉన్న డివైడర్లు పచ్చని మొక్కలతో అలరిస్తున్నాయి.. రోడ్డుకు ఇరువైపులా గోడలపై తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళా రూపాలు ఆకర్షిస్తున్నాయి. జంక్షన్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లు విభిన్నంగా ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. సువిశాల సాగరతీరం సరికొత్త అందాలను అద్దుకుంది. కైలాసగిరి, సీతకొండల రాళ్లపై చిత్రాలు ప్రతి ఒక్కరినీ కట్టి పడేస్తున్నాయి. పర్యాటక ప్రాంతాలు మరింత అందంగా ముస్తాబయ్యాయి. కొత్త బీచ్‌లతో పాటు ఐలవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ వంటివి పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. ఇలా సిటీ ఆఫ్ డెస్టినీ మరో అంతర్జాతీయ సదస్సుకు సన్నద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ-20 సదస్సుకు సాగర తీరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ మరింత పెంచేలా.. దేశం గర్వించేలా సదస్సును విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరం మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే అతిరథ మహారథులందరినీ కట్టిపడేసేలా రూ.157 కోట్లతో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

తొలిసారి అవకాశం

విశాఖ అనేక అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. తాజాగా ప్రతిష్టాత్మక జీ20 సదస్సుకు ఆతిథ్యమిస్తోంది. ఇటీవలే దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ అయింది. దిగ్గజ పారిశ్రామికవేత్తలు విశాఖలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వనరులను ప్రపంచ దేశాలకు తెలియజెప్పారు. తాజాగా జీ-20 సదస్సు కోసం విదేశాల నుంచి ప్రతినిధులు విశాఖకు వస్తున్నారు. 'వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్' అనే థీమ్‌తో రాడిసన్ బ్లూ బీచ్ రిసార్ట్‌లో జీ-20 సదస్సు జరగనుంది. ఇప్పటికే 57 మంది ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. తొలి రోజు మూడు విభిన్న అంశాలపై సమావేశాలు జరగనున్నాయి. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ సదస్సును ప్రారంభించనున్నారు. సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సదస్సుకు హాజరవుతున్నారు. వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. రెండో రోజు 29వ తేదీన మౌలిక సదుపాయాల కల్పన అంశంపైన, మూడో రోజు 30న కెపాసిటీ బిల్డింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

జీ-20 సదస్సుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. 2,500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కటుదిట్టమైన బందోబస్తు కల్పిస్తోంది. ఇందులో 1,850 మంది సివిల్ పోలీసులు, 400 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్, 4 గ్రే హౌండ్స్ దళాలు, 2 క్యూఆర్టీ టీమ్స్, 6 ప్రత్యేక పార్టీలు, 2 ఏపీఎస్పీ ప్లాటూన్లను మోహరిస్తున్నారు. ప్రతినిధుల భద్రతా చర్యల్లో భాగంగా ఆరు ప్రాంతాలను రెడ్ జోన్లుగా పోలీసులు ప్రకటించారు. రాడిసన్ బ్లూ రిసార్ట్, ఆర్‌కే బీచ్ రోడ్, కైలాసగిరి, ముడసర్లోవ పార్క్, జిందాల్ ఎనర్జీ ప్లాంట్, స్కాడా మాధవధార ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డ్రోన్ల ఎగరవేతపై పోలీసులు నిషేదం విధించారు. ఇప్పటికే విదేశీ ప్రతినిధులు పర్యటించే ప్రాంతాల్లోను, వారు బస చేసే హోటల్ వద్ద బాంబ్, స్నిఫర్‌డాగ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కటుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన అభివృద్ధి పనులు

రోడ్ల అభివృద్ధి	46 కిలోమీటర్లు
పెయింటింగ్ పనులు	24 కిలోమీటర్లు
ఫుట్‌పాత్‌ల నిర్మాణం	10 కిలోమీటర్లు

ఏమేమి చేశారంటే..

- సీతకొండపై బీచ్ వైఎస్సార్ వ్యూ పాయింట్ ఆధునీకీకరణ
- ఐ లవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ ఏర్పాటు
- సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం బీచ్‌ల అభివృద్ధి
- కైలాసగిరి రోప్‌వే నుంచి తిమ్మాపురం వరకు ఫుట్‌పాత్‌లకు టెర్రాకోట్
- రోడ్లకు ఇరువైపులా వెదురు ఆకృతులపై పూలమొక్కలు
- విద్యుత్ స్తంభాలకు వెరైటీ సొగసులు

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక

- జీ20 సదస్సుకు హాజరు
- గాలా డిన్నర్‌లో పాల్గొననున్న సీఎం



సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభం కానున్న జీ-20 సదస్సుకు హాజరుకానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సాయంత్రం 5.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రుషికొండలో గల రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు జి-20 సదస్సుకు వచ్చే 20 దేశాల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం జరిగే 'గాలా డిన్నర్'లో పాల్గొని విదేశీ అతిథులకు ఆతిథ్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సదస్సునుద్దేశించి సీఎం మాట్లాడనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్స్ నుంచి బయలు దేరి 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం వెళ్తారు.



శిలలపై చిత్రాలు : సీతకొండ వ్యూ పాయింట్ వద్ద కళాకృతులు



వావ్ : చెట్లు..పువ్వులు..వెలుగులు



పువ్వులే..నవ్వులే : వెదురుతో కళాకృతులు



హోర్డింగులు అదరహో : జీ -20 సదస్సులో పాల్గొనే దేశాల చిహ్నాలతో హోర్డింగులు

పల్లె ముంగిట ఉత్తమ వైద్య సేవలు



తారువలో 104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ
- 104 వాహనాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్

దేవరాపల్లి: గ్రామీణ ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయం వద్ద దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాలకు కేటాయించిన 104 వాహనాలను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా వైద్య సిబ్బంది వాహనాలకు పూజలు జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన 104, 108 వాహనాలను ప్రతి మండలానికి కేటాయించి రాష్ట్ర వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. 104 వాహనాల ద్వారా అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్య సేవలను ప్రజలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్నారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేరుతో ఇంటింటా అందిస్తున్న వైద్య సేవలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్‌లు కర్రి సూరినాయుడు, నాగిరెడ్డి శతారినాయుడు, వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్‌ఈవో రాజశేఖర్, టీఎస్ఎన్ మూర్తి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నాణ్యమైన విద్య, వైద్యం సాధ్యమని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గోపాలపురంలో నాలుగు 104 వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు కూడా వైద్య సేవలు అందించేందుకు 104 సేవలను విస్తృతం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్యసిబ్బంది ద్వారా అందరికీ వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 16 కొత్త వాహనాల ద్వారా నేటి నుంచి సేవలు అందుతున్నాయన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో శారదా బాయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు తిరుపతి రావు, వాణి, పావని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల విన్నపానికి స్పందన

- సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్
- అడవి బిడ్డల వద్దకే కదలివచ్చిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

రోలుగుంట: కొండలు కోనల్లో మారుమూల గిరిజన తండా వారిది. రేషన్ అందక అక్కడ పలు కుటుంబాలు అల్లాడుతున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో జరిగే 'స్పందన' కార్యక్రమంలో తమ గోడు వెళ్లబోసుకునేందుకు అక్కడి గిరిజనులు సిద్ధమయ్యారు. రోలుగుంట మండలం అర్ల గిరిజన పంచాయతీ శివారు గ్రామం పీత్రిగెడ్డలోని ఆదివాసీల సమస్యను తెలుసుకున్న సాక్షి దినపత్రిక సోమవారం సంచికలో 'కలెక్టర్ సారూ... రేషన్ కార్డులిప్పించరూ...!' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ వార్త గురించి తెలుసుకున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉదయాన్నే స్పందించారు. గిరిజనులు జిల్లా కేంద్రానికి రానవసరం లేదని, అధికారులే అక్కడకు వస్తారని వర్తమానం పంపారు. వారి కష్టం తెలుసుకొని నివేదిక అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. తహసీల్దార్ రేషన్ డీలర్ పడాలమ్మ వద్ద ఉన్న రేషన్ పంపిణీ జాబితా పరిశీలించి, గ్రామంలో కార్డులు లేని వారి సమస్యలపై వీఆర్వో శ్రీనివాసరావుతో కలసి విచారించారు. అక్కడ పది మందికి కార్డులు లేవని గుర్తించారు. అయితే వీరిలో మర్రి సన్యాసిరావు పేరు.. అతని తండ్రి బాబూరావు కార్డులో, అన్నదమ్ములు కిలో రాజు, కిలో రంజుల పేర్లు తల్లి రేషన్ కార్డులో ఉన్నందున రేషన్ కార్డు జారీ కాలేదు. మిగిలినవారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే వాటిని పరిశీలించి రేషన్ కార్డుల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సాక్షికి తెలిపారు.

ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు



పది విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

- టెన్త్ విద్యార్థులతో డీఈవో

కె.కోటపాడు: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌ను సోమవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న హిందీ తరగతులను ఆమె పర్యవేక్షించారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల్లో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయం కంటే ముందుగానే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

ఆమె వెంట డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి టి.మధుమూర్తి, హెచ్ఎం సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి

- రాష్ట్ర పారిశ్రామిక విధానమే కారణం
- కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్ భేటీ



కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్

మహారాణిపేట : దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న వ్యాపార సంస్థలు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటున్నాయని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించే విధంగా రాష్ట్రంలో పారిశ్రామిక విధానం అమలు చేస్తున్నామన్నారు. అందుకే పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఏపీని ఎంచుకుంటున్నారని చెప్పారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో కొరియా అధికారుల ప్రతినిధుల బృందం సోమవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా విశాఖపట్నంలో ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపై చర్చించారు.

బకాయిలు చెల్లించండి.. వడ్డీ మాఫీ పొందండి

డాబాగార్డెన్స్: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఒకే సారి చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 34 విడుదల చేసిందని తెలిపారు. పన్ను బకాయి ఉన్న మొత్తాన్ని ఒకే సారి ఈ నెల 31లోపు చెల్లించినట్టయితేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. పన్నులను ఆన్‌లైన్ ద్వారా https://cdma.ap.gov.in/ నెట్-బ్యాంకింగ్ ద్వారా గానీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా గానీ, యూపీఐ ద్వారా కానీ చెల్లించవచ్చన్నారు.

నాగులాపల్లి వాసి మృతి కేసు ఛేదిస్తాం


యలమంచిలి సీఐ గఫూర్

మునగపాక: మండలంలోని నాగులాపల్లికి చెందిన యల్లపు మహలక్ష్మీనాయుడు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి సీఐ గఫూర్ తెలిపారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన పలువురు అనుమానితులను విచారించారు. మహలక్ష్మీనాయుడు మృతికి సంబంధించి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కోణాల్లో విచారణ చేశామన్నారు. నిందితులెవరైనా ఉపేక్షించేదిలేదన్నారు. త్వరలో కేసు మిస్టరీ వీడే అవకాశాలు ఉన్నాయన్నారు. కేసు విచారణకు సంబంధించి ఇరు కుటుంబాల నుంచి పూర్తి సహకారం కావాల్సి ఉందన్నారు. పూర్తి ఆధారాల కోసం విచారణ లోతుగా చేపడుతున్నామని వివరించారు.

ఫిర్యాదుదారుడి సమక్షంలో అర్జీల విచారణ

- అధికారులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్ స్పందనకు 175 అర్జీలు


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి

తుమ్మపాల: స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ కల్పనాకుమారి, డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరస్కరించిన దరఖాస్తుల్లో కారణాలను స్పష్టంగా తెలపాలన్నారు. ఫిర్యాదుదారుడి సమక్షంలో సమస్యలు విచారణ చేయాలన్నారు. స్పందన అర్జీల నమోదు కేంద్రం వద్దకు డీఆర్వో వచ్చి వృద్ధులు, దివ్యాంగుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో మొత్తం 175 అర్జీలు నమోదయ్యాయి.

- పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పనులు వేగంగా చేపట్టాలంటూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ గేటు వద్ద నాయకులు బి.వెంకటరమణ, ఎం.రామునాయుడు, రాజాన దొరబాబు, గురుబాబు పలువురు నిరసన వ్యక్తం చేశారు.
- క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషను కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఓట్ల కోసం నిజమైన ఎస్సీలకు రిజర్వేషన్లు దూరం చేయడం అన్యాయమని ఆ పార్టీ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు అరుగుళ్ల అప్పారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు రమేశ్వరరావు, తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

దేవదాయ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

- దేవదాయ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి మండలం మార్టూరు గ్రామానికి చెందిన కరణం ఆదిలక్ష్మి స్పందనలో ఫిర్యాదు చేశారు. మల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 1.46 ఎకరం భూమి సర్వే నంబరు 95లో ఉందని, అందులో నేను కౌలుకు సాగు చేస్తుండగా, గ్రామానికి చెందిన కరణం శేషు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది.

విద్యుత్ బకాయిలపై స్పష్టత ఇవ్వండి

పంచాయతీల్లో సీసీ చార్జీల బకాయిలు, చెల్లింపులపై స్పష్టత ఇవ్వకుండా తక్షణమే బిల్లులు చెల్లించాలంటూ ఏపీఈపీడీసీఎల్ హుకుం జారీ చేయడంపై మునగపాక మండలంలోని 26 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో విద్యుత్ బకాయిలు ఆర్‌ఈసీఎస్‌లో ఉన్నందున వాటిని పూర్తిగా రద్దు చేయాలని, విలేజ్ (విద్యుత్) హెల్పర్లను నియమించాలని కోరారు.

ఆ భూమి ప్రభుత్వ అవసరాలకే వినియోగించాలి

బుచ్చెయ్యపేట మండలం రాజాం సర్వే నంబరు 233లో ప్రభుత్వ భూమిని రీసర్వేలో భాగంగా కొందరి పేరున ఆక్రమణలో ఉన్నట్లు చూపిస్తూ అసైన్‌మెంట్ పట్టాలు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు మరిసా సతీష్, మరిసా రమణ, ఎం.సత్యారావు, సత్యనారాయణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, కొందరు నాయకులు కుమ్మక్కై ఎస్సీ, ఎక్స్ ఆర్మీ ఉద్యోగుల కోటాలో అసైన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రీన్ ఫారెస్టుగా పంచాయతీని గుర్తించారని తెలిపారు. ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి సదరు భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు.

ప్రభుత్వ భూమిపై సాగు హక్కు కల్పించాలి

రీసర్వేలో భాగంగా రోలుగుంట మండలం యర్రభూపాలపట్నం రెవెన్యూ సర్వే నంబరు71–2లో 2.96 ఎకరాలు పూర్వ కాలంగా సాగుచేసుకుంటున్న గయాళు భూమిని తమ పేరున నమోదు చేసి హక్కులు కల్పించాలని రైతు ఉడతపల్లి గంగరాజు కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు. దళిత కుటుంబానికి చెందిన తాము సదరు భూమిలో సాగు చేసుకుంటూ వచ్చిన ఫలసాయంతో జీవిస్తున్నామని, నిరుపేదలమైన మాకు సదరు భూమిపై అసైన్‌మెంట్ పట్టా మంజూరు చేయాలని కోరారు.

చట్టపరిధిలో సమస్యలు పరిష్కరిస్తా: ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో స్పందనకు సోమవారం 40 అర్జీలు వచ్చాయని ఎస్పీ గౌతమిసాలి చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి దిగువస్థాయి అధికారులతో ఆమె మాట్లాడారు. చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ తగాదాలు, చీటింగ్‌పై ఫిర్యాదులు ఎక్కువ వచ్చినట్లు తెలిపారు.

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు షోకాజ్

- డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

కె.కోటపాడు: మండలంలోని పాతవలస హైస్కూల్‌లో పాఠశాల నిర్వహణా లోపాలపై హెచ్‌ఎం శ్రీనివాసరావుతోపాటు మరో నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను ఇచ్చినట్లు డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. ఇక్కడ హైస్కూల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఎంఈవో టి.మధుమూర్తి, ప్రధానోపాధ్యాయులు నూకరాజు, శ్రీనివాసరావులతో కలిసి వెళ్లి మధ్యాహ్న భోజనం నాణ్యత, లెస్సన్ ప్లానింగ్, వర్క్‌బుక్స్, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, తదితర వాటిని పరిశీలించారు. వీటిలో లోపాలను గుర్తించి హెచ్‌ఎంతోపాటు నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఎంఈవో తెలిపారు.

విద్యుదాఘాతంతో మృతి


సురేష్ (ఫైల్)

నక్కపల్లి: మండలంలోని రమణయ్య పేటలో వీర్ల సురేష్ (34) విద్యుత్ షాక్‌కు గురై సోమవారం మృతి చెందాడు. అతడు తన ఇంటి వద్ద కొబ్బరిచెట్టు కాయలు ఇనుప చువ్వతో తీసేందుకు ప్రయత్నిస్తుండగా, పక్కనే హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దాంతో స్పృహ తప్పి పడిపోయిన అతడ్ని కుటుంబ సభ్యులు వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య భవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు.

కోతుల బెడదతో ఎలుగుబంటి అవతారం


ఎలుగుబంటి వేషంలో ఉమ్మలాడ గ్రామ రైతు

మునగపాక: వానరుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎలుగుబంటి వేషాలు వేయాల్సిన పరిస్థితులు ఉమ్మలాడలో నెలకొన్నాయి. ఇక్కడ కొంత కాలంగా వానరులు ఇష్టానుసారంగా తిరుగుతూ పొలాల్లో పంటలతోపాటు ఇళ్లలోని సామగ్రిని ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే. వీటిని అదుపు చేసేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రైతులు ఎలుగుబంటి వేషాలు వేసి పొలాల్లో తిరుగుతూ వానరులను గ్రామం నుంచి తరిమికొట్టేందుకు నడుం బిగించారు. ఉన్నతాధికారులు స్పందించి వానరుల తరలింపుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులు

- భర్తే హంతకుడు
- అనుమానంతోనే భార్య హత్య
- ఒడిశా నుంచి వలసొచ్చి భద్రాచలంలో నివాసం


హత్య ఘటన వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లో ఈ నెల 15న కలకలం రేపిన యువతి దారుణ హత్య ఘటన మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆమె భర్తే నిందితుడుగా గుర్తించి అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి వివరాలను చింతూరు అడిషనల్ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్లో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కలిమెల తాలూకాలోని పులకనకొండ గ్రామానికి చెందిన సొంది రామ్, సొంది కుమార్ ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతేడాది నుంచి భార్యపై అనుమానం పెంచుకుని వేధిస్తుండగా వీరిద్దరి మధ్య కలహాలు రేగాయి. ఈ నేపథ్యంలో భార్య రామ్ అక్కడ నుంచి రెండు నెలల క్రితం వచ్చి తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని సుందరయ్యనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. విషయం తెలుసుకున్న భర్త కుమార్ 15 రోజుల క్రితం అక్కడకు వచ్చాడు. ఇద్దరికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో ఈ నెల 14న రాత్రి ఎటపాక మండలం పురుషోత్తపట్టణం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీ సమీప పొదల్లో భార్యకు పూటుగా మద్యం తాగించి తాను తాగుతున్నట్లు నటించాడు. అక్కడ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో వెనుక నుంచి బండరాయితో ఆమె తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. చనిపోయిందని నిర్ధారించుకుని ముళ్ల పొదల్లో మృతదేహాన్ని పడేసి అక్కడ నుంచి పరారయ్యాడు.

నిందితుడు పట్టుబడింది ఇలా...

గుర్తుతెలియని యువతి దారుణ హత్యగా కేసు నమోదు చేసుకున్న ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్సై పార్థసారది దర్యాప్తును వేగవంతం చేశారు. ఆమె గుర్తుల ఫొటోలతో కూడిన వివరాలు కరపత్రాలుగా ముద్రించి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోకి దర్యాప్తు బృందం వెళ్లి విచారణ చేసింది. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఎటపాక పోలీసులను సంప్రదించగా, మృతురాలు రామ్(33) భర్తే హంతకుడుగా అనుమానించి నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 26న హంతకుడు కుమార్ తన భార్య నివాసం ఉన్న ఇంటికి వచ్చాడు. అక్కడ తన బట్టలు తీసుకుని హైదరాబాదు కూలీ పనులకు బయలుదేరుతున్న సమయంలో పోలీసులకు చిక్కాడు. నిందితుడిని రిమాండ్‌కి తరలించారు. ఈ కేసు మిస్టరీని చాకచక్యంగా త్వరగా ఛేదించిన సీఐ, ఎస్సై, మిగతా బృందాన్ని ఏఎస్పీ అభినందించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన డీఈవో


డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడిని కలిసిన నూతన డీఈవో వెంకటలక్ష్మమ్మ

దేవరాపల్లి: నూతన డీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎం. వెంకటలక్ష్మమ్మ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని తారువ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారంగా అమలు చేస్తున్న రాగి జావ పంపిణీపై ఆరా తీశారు. ఈమె వెంట డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు ఉన్నారు.

సింహాచలం నాయుడు మృతిపై పోలీసుల నిర్లక్ష్యం

- దేవరాపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి కుటుంబీకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ తాతారావు తదితర్లు

దేవరాపల్లి: జామి సింహాచలంనాయుడు(28) మృతి చెందడానికి కారుకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అతని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో ఈ నెల 18న అర్ధ రాత్రి సమయంలో అతడు చెట్టుకు ఉరేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారం రోజులు దాటినా పోలీసుల దర్యాప్తులో పురోగతి లేదని మృతుడి తల్లి సింహాచలమ్మ, సోదరుడు గౌరినాయుడు, ఇతర కుటుంబ సభ్యులు, స్థానికులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీపీఎం నాయకుడు డి. వెంకన్న మద్దతు ప్రకటించారు. సింహాచలంనాయుడు మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని ఫిర్యాదు చేశామని, ఆ దిశగా ఎందుకు విచారణ చేయడం లేదని పోలీసులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సీఐ ఎస్. తాతారావు, కె.కోటపాడు ఎస్‌ఐ ఆర్. ధనుంజయ్ జోక్యం చేసుకుని అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఈ నిరసనలో గవిరెడ్డి సింహాచలంనాయుడు, బండారు అప్పలనాయుడు, సిహెచ్. భవానీ, అక్కమ్మ, నమ్మి దేముళ్లు, చొక్కాల సన్నిబాబు, దేముళ్ల పాల్గొన్నారు.

బియ్యం బస్తాల మాటున
గంజాయి తరలింపు


పోలీసుల బస్తాల పరిశీలన


కశింకోటలో పోలీసులు పట్టుకున్న గంజాయి బస్తాలు

- కశింకోటలో మాటు వేసి లారీ స్వాధీనం
- రూ.17.80 లక్షల విలువైన గంజాయి పట్టివేత

కశింకోట: బియ్యం బస్తాల మాటున లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.80 లక్షల విలువైన 890 కిలోల గంజాయిని కశింకోట పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. లారీని సీజ్ చేశారు. అనకాపల్లి సీఐ ఎ. రవికుమార్ సోమవారం రాత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు లారీలో బియ్యం బస్తాల మాటున 30 గంజాయి బస్తాలను తరలిస్తుండగా, జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో కశింకోట పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి కశింకోట పోలీసు స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో మాటు వేసి గంజాయి తరలిస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. బియ్యం బస్తాల మాటున గంజాయి బస్తాలను ఉంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ హరదేవ్‌సింగ్‌ను విచారించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన గుప్తా అనే వ్యక్తి విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి బీహార్, జార్ఖండ్, హర్యానా తదితర రాష్ట్రాలకు రవాణా చేసి అమ్ముతుంటారని వివరించాడు. దాంతో గంజాయి రవాణాలో గుప్తాతోపాటు మరికొందరి పాత్ర ఉన్నట్లు భావిస్తున్నారు. నిందితుడు, డ్రైవర్ హరదేవ్ సింగ్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల పరిష్కార వేదిక ఈపీఎఫ్ అదాలత్


అదాలత్‌కు హాజరైన ఆర్టీసీ రెగ్యులర్, విశ్రాంత ఉద్యోగులు


మాట్లాడుతున్న ఈపీఎఫ్ ఈవో కృష్ణమోహన్

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తూ ఈపీఎఫ్ సభ్యత్వం కలిగిన ప్రతి ఉద్యోగి సమస్యను సత్వరం పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధి ఆప్కేనికిట్ (ఈపీఎఫ్ అదాలత్)ను అందుబాటులోకి తీసుకువచ్చిందని విశాఖ రీజియన్ ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం జరిగిన అదాలత్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రం ఆదేశాల మేరకు మూడు మాసాలుగా అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, జిల్లాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రతి నెల ఆయా ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నారపిన్ని రమేష్, పి.కామేశ్వరరావు, డిపో మేనేజర్ ఎస్.సుజాత, పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆహార పదార్థాలతో కంపెనీలు చేసే మోసాలు అరికట్టాలి
- సన్మాన సభలో పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ


డాక్టర్ ఖాదర్ వలీని సత్కరిస్తున్న ప్రముఖులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): సహజ సిద్ధంగా పండే చిరు ధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. అదే సమయంలో రసాయనాలు మిళితమైన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే కంపెనీల మోసాలను అరికట్టాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో డాక్టర్ ఖాదర్‌వలీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమి సంహారక మందుల వినియోగంతో జీవవైవిధ్యానికి ముప్పు తీసుకువస్తున్నారన్నారు. పింక్ రివల్యూషన్ పేరుతో పెద్ద ఎత్తున జంతువులను పెంచి మాంసం రెడీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కృత్రిమ ఆహార పదార్థాలు జీవన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తాయని హెచ్చరించారు. మానవ జాతికి అదృష్టం కొబ్బరి పాలు అని, ఇవి తల్లి పాలతో సమానమన్నారు. చిరుధ్యానాలు సాగుకు ఎలాంటి రసాయనిక మందులు అవసరం లేదన్నారు. దీంతో జీవ వైవిధ్యాన్ని కాపాడవచ్చునని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ డాక్టర్ ఖాదర్ వలీ చిరుధ్యానాల ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పి గొప్ప కీర్తిని పొందారని కొనియాడారు. ఈ ఏడాదిని ప్రపంచ చిరుధ్యానాల ఏడాదిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, విజయనిర్మాణ్ అధినేత విజయకుమార్, గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం నేతలు జగలంకుమారస్వామి, ఎం.యుగంధర్‌రెడ్డి, శ్రీదేవి, గ్రీన్ క్లైమెట్ అసోసియేషన్ ప్రతినిధి జనపరెడ్డి రత్నం పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థుల వివరాలు అందజేయండి

విశాఖ విద్య: జాతీయ ప్రతిభాన్వేషణ(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందజేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్ సూచించారు. విద్యార్థుల కుల, ఆదాయ, 7వ తరగతి మార్కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, హాల్ టికెట్, దివ్యాంగ విద్యార్థులు ఉన్నట్లయితే, ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాల జెరాక్స్ ప్రతులను ఈ నెల 29 నాటికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. తుది జాబితా విడుదల చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి అభ్యర్థనలను తీసుకోవటం జరగదన్నారు. ఈ విషయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకొని, సకాలంలో ధృవీకరణ పత్రాలను అందజేయాలన్నారు.

క్లుప్తంగా

ఎంపీని కలిసిన నూకాంబిక ఆలయ అధికారులు



ఎంపీ సత్యవతిని సత్కరిస్తున్న ఆలయ అధికారులు

అనకాపల్లిటౌన్ : నూకాంబిక ఆలయ నూతన ఈవో బండారు ప్రసాద్, దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా ఇన్‌చార్జి రాజారావులు ఎంపీ సత్యవతిని ఆమె కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువా, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మలాడ దేవీతల్లికి రూ.20 వేల విరాళం



ఉమ్మలాడ శ్రీదేవీతల్లి ఆలయ అభివృద్ధికి రూ.20 వేల విరాళం అందిస్తున్న జగన్నాథరావు

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ శ్రీ దేవీతల్లి ఆలయ అభివృద్ధికి సూరిశెట్టి నూకఅప్పారావు కుమారుడు జగన్నాథరావు(కేబుల్ టీవీ) సోమవారం రూ.20వేల విరాళమిచ్చారు. సంబంధిత నగదును ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు దాతను అభినందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలని కోరారు.

నూకాంబిక ఈవో ప్రసాద్‌కు అభినందన



ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన బండారు ప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పండగలో భాగంగా ఆలయానికొచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవోను కోరారు. ఈవోను కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు ఉన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 2,085 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,250
మొదటి రకం	3,850	4,180
రెండో రకం	3,410	3,840
మూడో రకం	3,200	3,400

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 117 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-47 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-52 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 482 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 389 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి బాటలో నరసింగపల్లి రైల్వేస్టేషన్

- కొత్తగా అదనపు ప్లాట్‌ఫారం నిర్మాణం
- పరిశ్రమల ఏర్పాటుతో పెరిగిన ప్రాధాన్యం



నరసింగపల్లి రైల్వే స్టేషన్



రూ.60 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ప్లాట్ ఫారం

కశింకోట : మండలంలోని నరసింగపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.60 లక్షలతో చేపట్టిన ప్లాట్‌ఫారం నిర్మాణం దాదాపుగా పూర్తికావస్తోంది. చిన్నచిన్న పనులతోపాటు, తుది మెరుగులు మాత్రమే మిగిలున్నాయి. ఈ పనులు కూడా పూర్తయితే.. అదనంగా మరో ప్లాట్‌ఫారం అందుబాటులోకి వచ్చినట్టే.

యాభయ్యేళ్ల చరిత్ర

అనకాపల్లి-యలమంచిలి మార్గంలో ఉన్న నరసింగపల్లి రైల్వే స్టేషన్ సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటయింది. కశింకోట, మునగపాక మండలాలకు చెందిన పల్లపు సోమవరం, నరసింగబిల్లి, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, ఏఎస్ పేట, గణపర్తి, చూచుకొండ, మెలిపాక తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి, తుని, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ స్టేషనే దిక్కు. ప్రస్తుతం ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరుగుతుండటంతో స్టేషన్ అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించారు. కొత్తగా స్టేషన్ భవనాన్ని నిర్మించి దానిలోకి స్టేషన్ కార్యకలాపాల్ని మార్చేందుకు, వసతుల పెంపునకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పరిశ్రమల రాకతో పెరిగిన ప్రాధాన్యం

ప్రస్తుతం విశాఖ-రాజమండ్రి, విశాఖ-కాకినాడల మధ్య రానూపోనూ నడిచే ప్రత్యేక రైళ్లతోపాటు విశాఖ-చెన్నై వీక్లీ స్పెషల్ కూడా ఇక్కడ ఆగుతోంది. పెద్దగా ఆదాయం లేకపోవడంతో పదేళ్ల క్రితం వరకు ఈ స్టేషన్ కేవలం క్రాసింగ్‌లకే పరిమితమయ్యేది. స్టేషన్ సమీపంలో చెన్నైకి చెందిన భారీ సిమెంట్ పరిశ్రమతోపాటు, లాజిస్టిక్ పరిశ్రమ కొత్తగా ఏర్పాటయ్యాయి. దీంతో ఈ స్టేషన్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఇక్కడి నుంచి ప్రత్యేక రైల్వే లైన్లను ఆయా పరిశ్రమలకు లింక్ చేసి గూడ్స్ రైళ్లపై సిమెంట్, ఈ పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులను రవాణా చేస్తున్నారు. లాజిస్టిక్ పరిశ్రమకు గూడ్స్ రైళ్లలో వచ్చిన సరకును నిల్వ చేసి, ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రైల్వేకు అదనపు ఆదాయం పెరిగింది. వీటితో పాటు ఇక్కడే ఇంకో భారీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటయింది. మరొకటి నిర్మాణంలో ఉంది.

కొత్తగా ప్లాట్‌ఫారం

ఈ నేపథ్యంలో ఇక్కడి సరకు రవాణా గూడ్స్ రైళ్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా రైల్వే శాఖ గత ఏడాది స్టేషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్టేషన్ ఏర్పాటయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ రెండో వైపు అనకాపల్లి-యలమంచిలి మార్గంలో ప్లాట్‌ఫారం లేదు. రూ.60 లక్షలు వెచ్చించి తాజాగా ఇక్కడ ప్లాట్‌ఫారం నిర్మాణం చేపట్టారు. దీనికి మధ్యలో ఒక చోట రూ.7 లక్షలతో వంతెన నిర్మించి, ప్లాట్ ఫారానికి తుది మెరుగులు దిద్దాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు. దీన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యలమంచిలి-అనకాపల్లి మార్గంలో ఉన్న ప్లాట్‌ఫారం చిన్నదిగా ఉంది. దీన్ని పొడవుగా విస్తరించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ప్లాట్‌ఫారాలు పూర్తయితే పొడవు ఎక్కువగా ఉన్న మరి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు భవిష్యత్‌లో ఇక్కడ ఆగడానికి, సరకు రవాణాకు గూడ్స్ రైళ్లు నిలిపేందుకు, రైళ్ల క్రాసింగ్‌లకు మరింత అనువుగా ఉండనుంది.

మూడు నెలల్లో పనులు పూర్తి

నరసింగపల్లి రైల్వేస్టేషన్‌లో మూడు మాసాల్లో ప్లాట్‌ఫారం పనులు పూర్తి చేస్తాం. దీని నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రైల్వే సివిల్ పనులన్నీ విజయవాడ డివిజన్ పరిధిలోకి వస్తాయి. గూడ్స్ రైళ్లలోకి సిమెంట్ బస్తాలు, ఇతర సరకుల ఎగుమతికి ఈ ప్లాట్‌ఫారం ఉపకరిస్తుంది.

– కె.సత్యశ్రీనివాస్, స్టేషన్ మేనేజర్

కాలువల ఆక్రమణల్ని అరికట్టాలని వినతి



రాజాబాబుకు వినతిపత్రం అందిస్తున్న కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలోని ఇరిగేషన్, పంట కాలువలు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, మేయర్ గొలగాని హరివెంకట కుమారిలను 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ సోమవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందించారు. 1952 రెవెన్యూ రికార్డుల ప్రకారం యల్లయ్య, చెర్లోపలి ప్రధాన కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, ప్రధాన కాలువలతోపాటు వీధి కాలువలు కూడా పరిశుభ్రం చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆమె వెంట వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు ఉన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా కొనసాగాయి. కిలో ఉల్లిపాయలు రూ.20, టమాటా రూ.25, బంగాళాదుంపలు రూ.30, క్యారెట్, బీట్‌రూట్, వంకాయ రూ.40, బెండకాయ, దొండకాయ రూ.60, చిక్కుడు, గోరు చిక్కుడు రూ.80, కేప్సికం రూ.వంద, బీన్స్ పిక్కలు రూ.120కి విక్రయాలు సాగాయి.

దుర్గమాంబ విగ్రహ పునఃప్రతిష్ట



శ్రీదుర్గమాంబ అమ్మవారు

తుమ్మపాల : అనకాపల్లి మండలం గోపాలపురం గ్రామంలో శ్రీ దుర్గమాంబ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సువిశాలమైన ప్రదేశంలో చేపట్టిన ఆలయ నిర్మాణం అద్భుతంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని అందరి భాగస్వామ్యంతో పునర్నిర్మించేందుకు కృషి చేసిన ఎంపీపీ గొర్లి సూరిబాబును దుశ్శాలువా, గజమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగ ఎంపీపీ మాట్లాడుతూ సువర్ణభూమి వెంచర్స్, గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలకు పైగా ఖర్చు చేసినట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పసుపు కుంకుమలతో అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం గ్రామవీధుల్లో మహిళలు అధిక సంఖ్యలో కలశాలు నెత్తిన మోసుకుంటూ ఊరేగింపుగా వచ్చి, అమ్మవారిని అభిషేకించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల బుల్లిబాబు, మందపాటి జానకీరామరాజు, మలసాల కిషోర్, గున్నుంనాయుడు, పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాలరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంటీసీలు, భక్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన



కశింకోటలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శశికళ

కశింకోట : చిరు ధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీవో శశికళ అన్నారు. కశింకోటలోని పంచాయతీ కార్యాలయం, జి.భీమవరం స్కూల్లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలు, వాటితో అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరు ధాన్యాలను అనారోగ్యంతో బాధపడేవారితో పాటు ఆరోగ్యవంతులు కూడా తీసుకోవాలన్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు రావన్నారు. రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, సామలు, ఆరికలు, ఊదల్లో ఏదో ఒక చిరు ధాన్యాన్ని ప్రతి రోజూ ఆహారంగా తీసుకుంటే అన్ని రకాల పోషకాలు శరీరానికి అందుతాయన్నారు. చిరు ధాన్యాలను ముందు నానబెట్టి మొలకలు వచ్చాక తీసుకోవాలన్నారు. లేదా వేయించి పొడి చేసి జావలా తయారు చేసి తీసుకోవచ్చన్నారు. చిరు ధాన్యాల్లో తక్కువ కేలరీలు, అధిక ప్రొటీన్లు, ఫైబర్ వల్ల బరువు తగ్గడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలను ఆహారంగా సేవించి ఆరోగ్యవంతంగా జీవించాలన్నారు.

వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు మంత్రి జయరజని, హనుమంతు వెంకట లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు అల్లం శంకరరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రమేష్, చిన్నోడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.సుచరిత, ఝాన్సీ, హెచ్‌ఎం జి.దేముడుబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండవాలుపై కబ్జాదారుల కన్ను!



అమృతపురంలో ఆక్రమణలకు పాల్పడుతున్న కొండవాలు ప్రాంతం

- అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యం

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో విలువైన ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్నుపడింది. కొంత మంది ఆక్రమణలకు పాల్పడుతూ పాకలు ఏర్పాటు చేస్తున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ భూములు కావడంతో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. సెంటు రూ. 3 నుంచి 4 లక్షలకు వరకు ధర ఉండడంతో కబ్జాదారులు దశల వారీగా పాకలు,షెడ్లు, పక్కా భవనాలు నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

అమృతపురం గ్రామంలోని సర్వే నెంబర్ 303-2లో 55 ఎకరాల్లో కొండ ఉంది. దీని చుట్టూ ఉండే కొండ పోరంబోకు ప్రాంతంలో కొంత మంది పాకలు,షెడ్లు వేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా తాటి చెక్కలు సిద్ధం చేసి పాకలు వేసే ప్రయత్నాలు చేస్తున్న వారిని వీఆర్‌ఏ బండ అప్పలనర్సమ్మ అడ్డుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. దీంతో అడ్డుకునేందుకు వెళ్లిన వీఆర్వో జగన్నాథంపై కూడా దౌర్జన్యానికి దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. అప్పారావు అనే వ్యక్తి తన ఆధీనంలో ఉన్న సుమారు 2 ఎకరాల భూమిని గతంలో మైనింగ్ కోసం లీజ్‌కు ఇచ్చానని, నష్టపరిహారంగా రూ.40 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో 40 సెంట్లు భూమి తనకు కేటాయించాలని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ సత్యనారాయణకు సమాచారం అందించామన్నారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆక్రమణకు పాల్పడుతున్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వీఆర్వోలకు ఆదేశించామన్నారు.

సీతమ్మవారి సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగింపులో మహిళలు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన కేఎన్‌ఆర్ పేటలో సోమవారం సీతమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా పలు రకాల సంప్రదాయ వంటకాలు, అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, పసుపు, కుంకుమ, అరటిపళ్ల తలపై మోసుకుంటూ ఆలయానికి చేరి, అక్కడి నుంచి నుంచి గ్రామం మొత్తం ఊరేగారు. తిరిగి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నివేదించారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ ఆవరణలో ఆయుష్ విభాగంలో దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారిణి కె.లావణ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కీళ్లనొప్పులు, షుగర్, చర్మ, నరాలు, గైనిక్ సంబంధిత వ్యాధులకు ఉత్తరాఖండ్ హరిద్వార్ నుంచి ఆయుర్వేద మందులు వచినట్టు వెల్లడించారు. అవసరమైన వారు ఆయుష్ విభాగంలో వైద్య సిబ్బందిని సంప్రదించి, మందులు పొందవచ్చన్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



ఆసరా పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆనందంగా జీవించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రభుత్వ పథకాలను మహిళలకు అందిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు గ్రామంలో 53 గ్రూప్‌లలోని 645 మంది లబ్ధిదారులకు రూ.48లక్షల 58వేల నగదును వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేసినట్లు తెలిపారు. గ్రామంలో గ్రూప్‌లకు మూడు విడతల్లో రూ.కోటీ 62 లక్షల మేర రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మి, వెలుగు ఏపీఎం నీలాచలం, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు ఎస్.శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

29న ఆసరా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజు

పరవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న జరగనున్న వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఏపీఎం కనకం, వీవోఏలు పాల్గొన్నారు.

'పోస్టల్' సొసైటీ అధ్యక్షునిగా నూకరాజు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షునిగా బండారు నూకరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం డీసీఎంఎస్ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా వి.సింహాచలం, కార్యదర్శిగా వై.వీరభద్రం, కోశాధికారి కె.కిరణ్‌కుమార్‌లను డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వి.వి.సత్యకుమార్ వ్యవహరించారు. నూతన కమిటీ ఐదేళ్లు కొనసాగనుంది.

పది పరీక్షలకు ఏడు కేంద్రాలు

పరవాడ: ఏప్రిల్ 3 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం మండలంలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.సునీత చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో 13 ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలు, 7 ప్రైవేటు పాఠశాలల నుంచి 1278 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఆమె చెప్పారు.

నేత్రపర్వంగా సీతారాముల పెళ్లిరాట



పెదరామస్వామి ఆలయంలో పెళ్లిరాట వేడుకల్లో దాడి పద్మావతి



చేపలబజారు రామాలయంలో పెళ్లిరాట వేడుకల్లో మహిళలు



సీతారాముల పెళ్లిరాటకు పూజలు

- ఊరూవాడా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి కల్యాణ వేడుకల్లో భాగంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పెళ్లిరాటోత్సవాలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు.

- గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో దాడి పద్మావతి ఆధ్వర్యంలో పెళ్లిరాటకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పార్టీ నేతలు మళ్ల రాజా, మాజీ కౌన్సిలర్ కొణతాల రత్నాజీ, కర్రి అప్పాజీ, కోరిబిల్లి ఆరుద్ర, కోరిబిల్లి పరి, కొణతాల గోపీకృష్ణ, మళ్ల శ్రీను, పెంటకోట చిన్న, పెంటకోట సతీష్, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.
- ప్రధాన రహదారిలోని చేపలబజారు సీతారామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు రాటకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 30న కల్యాణం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధులగుండా ఊరేగించనున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం సీతారాముల ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు కొణతాల నారాయణరావు, సతివాడ దుర్గారావు, సిరసపల్లి సూరిబాబు, దాశిరెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కొణతాల జగన్నాథరావునాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కామధేనువు జగదీశ్వరరావు, కార్యదర్శి కుంచా చిన్న, కోశాధికారి పాముల ప్రసాద్, కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు పాల్గొన్నారు.
- వేల్పులవీధి సీతారామాలయం, విజయరామరాజుపేట, గాంధీనగరం, లక్ష్మీదేవిపేట, పూడిమడక రహదారి, కోట్ని వీధి, గవరపాలెం చినరామస్వామి ఆలయాల్లో పెళ్లిరాట వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

వేడుకగా సీతారాముల పెళ్లిరాట

కశింకోట : స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సోమవారం పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా నేరేడు కొమ్మను తెచ్చి శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పసుపు రాసి, బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం దానిని పెళ్లి రాటగా నిలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి'

పరవాడ: ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో సోమవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు హక్కుల కోసం మార్చ్ టు పార్లమెంట్‌లో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో వేలాదిగా రైతు, కార్మికులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని గనిసెట్టి కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.పోతినాయుడు, పి.చిన్నారావు, కె.వెంకునాయుడు, ఎ.రాజా, కె.దారబాబు, సత్తిబాబు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.